Page No. 1 - Green Page No. 1 - Red Page No. 1 Black

ACCION FRATERNA ecology centre
sustainable . human . nature

# ఎ.ఎఫ్. ఎకాలజీ సెంటర్, అనంతపురం.

## ఈ మాసపు సమాచారం

జూన్, 2010

FOR PRIVATE CIRCULATION ONLY

## మీకు తెలుసా ?

### ఉష్ణ ప్రాంతాలలో చెట్ల ఉపయోగం

ఉష్ణమండల ప్రాంతాలలో వాతావరణాన్ని నియంత్రించడానికి, ప్రకృతి వలన నష్టాలు తగ్గించడానికి చెట్లు చాలా చక్కగా ఉపయోగపడుతాయని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. చెట్లు ఉన్న పరిసరాల్లో భూమీ మీద సేంద్రీయ పదార్ధం ఎక్కువగా వుంటుంది. ఉదాహరణకు సర్కారు తుమ్మ కంపచెట్లు పెరిగిన ప్రాంతంలో గమనిస్తే, బయట చెట్లు లేని ప్రాంతంలో కంటే, చెట్లు వున్న ప్రాంతంలో భూమిమీద సేంద్రీయ పదార్ధం ఎక్కువగా కనపడుతుంది. చెట్లు వున్న ప్రాంతంలో నేలమీద నత్రజని, పోషక పదార్ధాలు ఎక్కువగా కనిపిస్తాయి. భూమి లోపలి పొరలవరకూ పోషక పదార్ధాలు ప్రయాణిస్తాయి. వర్షం నేరుగా భూమిపై వేగంగా పడకుండానే వేగాన్ని నియంత్రించడంవల్ల, నేల పొర వర్షానికి కొట్టుకుని పోకుండా వుంటుంది. అనేక విధాలుగా క్రియలు, ప్రతి క్రియలు జరగడం మూలంగా నేల భౌతిక పరిస్థితి పరిపుష్టంగా మారుతుంది. ఎండలు ఎక్కువగా కాస్తున్న కాలంలో చెట్లు వున్న ప్రాంతాలలో వాతావరణ వేడి రెండు సెంటీగ్రేడుల వరకూ తక్కువగా వుంటుంది. అలాగే వర్షాకాలంలో 16 సెంటీగ్రేడుల వరకూ భూమి ఉపరితలం మీద ఉష్ణోగ్రత వుంటే, భూమిలోపల 5 సెంటీగ్రేడులవరకూ ఉష్ణోగ్రతను నిలిపి వుంచుతుంది. ఎండాకాలంలో ఉష్ణోగ్రతలను తగ్గించి, వర్షాకాలంలో ఉష్ణోగ్రతలను పెంచుతుంది. చెట్లు పెంచడంవల్ల ఆదాయంతోపాటు, ప్రకృతి నుంచి రక్షించడానికి ఉపయోగపడుతాయి.

**(లీసా ఇండియా మార్చి, 2009 నుండి)**

### మునగ విత్తనాలు నీటిని శుద్ధి చేస్తాయి

మునగ కాయలు, ఆకులు వాడడానికి చాలా మంచివని మనకందరికీ తెలుసు. అయితే మునగ విత్తనాలు దాదాపు 98 శాతం నీటిని శుద్ధి చేస్తాయని శాస్త్రవేత్తలు కనుకున్నారు. మునగవిత్తనాలను మెత్తగా నూరి నీటిలో కలిపి కొంచెంసేపు అలాగే ఉండనిస్తే, అపరిశుభ్ర నీరు కిందికి చేరుకుంటుంది. ఆఫ్రికా దేశాలలో పురాతన కాలం నుంచి, నీటి శుద్ధి కొరకు మునగ విత్తనాలను వాడడం జరుగుతోందని చెప్తున్నారు.

**(డౌన్ టు ఎర్త్ మే, 1-15/2010 సంచిక నుండి)**

**చిట్కా :** ఏవైనా చర్మ సంబంధ సమస్యలు వచ్చినపుడు ఆ ప్రాంతంలో బొప్పాయి పాలను పూస్తే తగ్గిపోతాయి.

## సుస్థిర వ్యవసాయ పద్ధతులతో ఖరీఫ్ 2010ని స్వాగతిద్దాం !

"లైలా" తుఫాను పుణ్యమా అని జిల్లాలో వానలు విస్తారంగా కురిసినాయి. అన్ని చోట్ల పదునయింది. ఖరీఫ్ వ్యవసాయం పనులకు కదలిక మొదలయింది. పొలాలు దుక్కి చేసుకునే వాళ్ళు, ఎద్దులు, ట్రాక్టర్ల కోసం వెంపర్లాడితే, విత్తనం కోసం చాలా ముందే వెతుకులాట ప్రారంభిస్తున్నారు. పోయిన సారి చెనిక్కాయ పంట బాగా వచ్చి వుంటే, ఈ సారికి విత్తనం కాయ సమస్య కనీసంగా 50 శాతం తీరి వుండేది. కానీ పోయినసారి పంట చేతికి రాకపోవడం వలన చాలా మందికి విత్తన కాయ సమస్య వుంది. పూర్తిగా ప్రకృతి దయాదాక్షిణ్యాల మీదనే మన జిల్లా వ్యవసాయం ఆధారపడి వుంది కాబట్టి, ప్రతిసారి మనకు ఈ ప్రయాసలు తప్పవు. ఇన్నాళ్ళూ మనం తక్కువ వర్షాపాతంతోనే బాధపడేవాళ్ళం. ఇపుడు తక్కువ వర్షాపాతంతో పాటు, వానల మధ్య పెరుగుతున్న వ్యత్యాసాలు, పెరుగుతున్న వేడి, చెట్లు చేమలు లేకపోవడం, రసాయనిక ఎరువుల వాడకం మూలంగా పంటలకు రోగాలు అన్నీ మనం ఎదుర్కొంటున్న సమస్యలు. ప్రతి సమస్యకు ఎక్కడో ఒక చోట పరిష్కారముంటుంది. దానికొక మార్గముంటుంది. దానినే మనం అన్వేషించాలి. వెతికి పట్టుకోవాలి. అందుకే వ్యవసాయంతో దగ్గరి దారులు లేవు. కష్టపడితే తప్ప ఫలితం దొరకదు. మన ఆలోచనలకు పదును పెట్టుకోవాలి. వ్యవసాయంలో పెరుగుతున్న ఖర్చులకు, నష్టాలకు ప్రధాన కారణం రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకమే కారణమన్న విషయం మనకు అర్థం అవుతుంది. పంట నష్టాలతో పాటు పెరిగిపోతున్న వ్యవసాయ ఖర్చులు రైతులను కష్టాలపాలు చేస్తున్నాయన్న విషయం మనకందరికీ తెలిసిందే. ఇదేదో మనం మాత్రమే చెప్పుకుంటున్న విషయం కాదు. ప్రపంచ వ్యాప్తంగానే, రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు తక్కువ ఖర్చుతో, స్థానిక వనరులను వినియోగించుకొని, సేంద్రీయ పద్ధతుల్లో వ్యవసాయం కొనసాగాల్సిన అవసరాన్ని మనకు గట్టిగా చెపుతున్నారు. ఈసారి నైరుతి రుతుపవనాలు పోయిన సంవత్సరంలా కాకుండా సరైన సమయంలోనే వస్తున్నాయని, జూన్ మొదటి వారంలోనే ప్రారంభం కావచ్చునని వాతావరణ శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ఇది ఒక మంచి విషయమే. అయితే సంవత్సరానికి ఒకే పంట వర్షాధారం కింద పండించే మనం, ప్రణాళిక ప్రకారమే ముందుకు సాగాల్సి వుంటుంది. అవేమిటో వివరించే ప్రయత్నం చేస్తాను.

### మంచి విత్తనంతో మంచి పంటలను ఆశిద్దాం.

పంటకు ప్రధానమయింది విత్తనం. గత రెండు, మూడు సంవత్సరాలుగా టి.యం.సి 2 వేరుశెనగ రకంకంటే, అనంత జ్యోతి, కె6, కె9 రకాలు బెట్టకు తట్టుకుని మంచి దిగుబడులు వచ్చినట్లు రుజువయింది. కాబట్టి సాధ్యమయినంతవరకూ పైరకాల కోసం ప్రయత్నించమని రైతులకు విజ్ఞప్తి చేస్తున్నాను. మన సంస్థ పని చేస్తున్న గ్రామాలలో సస్యమిత్ర గ్రూపుల ద్వారా ఈ కొత్త రకాల విత్తనం రైతులకు అందుబాటులోకి రావడానికి సంస్థ చేయూతనిస్తోంది. మీ మీ గ్రామలలో గ్రామ సస్యమిత్ర గ్రూపులలో ఈ విషయాల్ని చర్చించి మంచి విత్తనం కోసం తగిన ఏర్పాట్లు చేసుకోవలసిందిగా కోరుతున్నాను. అలాగే మిగతా పంటల విత్తనాలు విత్తన బ్యాంకుల ద్వారా సాధ్యమయినంతవరకూ రైతులకు అందుబాటులోకి తెచ్చుకోవలసిందిగా కోరుతున్నాను. విత్తనాల కోసం ఎరువుల అంగళ్ళకు పోవడం మానివేయాలి. ఎక్కడో, ఏ వాతావరణంలోనే అభివృద్ధి చేసిన విత్తనాలు మన వాతావరణానికి సరిపోవు. ఈ వాతావరణానికి అలవాటు పడిన విత్తనాలు ఈ వాతావరణపు ఆటుపోట్లకు తట్టుకుంటాయన్న విషయాన్ని మనం మరచిపోరాదు. రంగు రంగుల ప్యాకెట్లలో, రైతులను ఆకర్షించడానికి దిగుబడుల ఆశలు కల్పిస్తూ అమ్మే విత్తనాలతో రైతులు మోసపోయే అవకాశం వుంది. అందుకే, ఏ విత్తనం వాడాలి ? ఎక్కడి నుండి తెచ్చుకోవాలన్న

→

"భూమాత అపారమైన తన అడవుల్ని, వన్య ప్రాణుల్ని, నదుల్ని, సముద్రాల్ని కాపాడుకుంటున్నంత వరకూ మానవ సంతతి వర్ధిల్లుతూనే ఉంటుంది" ఉపనిషత్తులు

విషయాలు గ్రామ సస్యమిత్ర గ్రూపుల సమావేశాల్లో చర్చించండి. పంటలకు తెగుళ్ళు రాకుండా ముందు జాగ్రత్తగా, సేంద్రీయ పద్ధతుల్లో విత్తన శుద్ధి చేయడాన్ని మరిచిపోకుండా ఆచరణలో పెట్టాలని కూడా నేను విజ్ఞప్తి చేస్తున్నాను.

## రసాయనిక ఎరువులకు దూరంగా ఉందాం.

ప్రకృతి సంక్షోభానికి, మనం అనుభవిస్తున్న వ్యవసాయ సంక్షోభానికి రైతుల దుర్భిక్షానికి, రసాయనిక ఎరువుల వాడకం ఒక ప్రధాన కారణం. ఈసారి పూర్తిగా రసాయనిక ఎరువులకు పూర్తిగా దూరంగా వుండే ప్రయత్నం చేద్దాం. రసాయనిక ఎరువుల ద్వారా రైతుల అప్పుల పాలవడమే కాకుండా భూములను కూడా ఇవి నిస్సారంగా మార్చి వేస్తున్నాయి. ఇన్నాళ్ళూ విచక్షణా రహితంగా మనం రసాయనిక ఎరువులు వాడిన కారణంగా జిల్లాలోని వ్యవసాయ భూములలో భాస్వరం, నత్రజని అవశేషాలు ఎక్కువగా వున్నాయి. కాబట్టి వాటిని తిరిగి వాడడంవల్ల మరింతగా భూములకు నష్టం కలుగుతుందేతప్ప, ప్రయోజనం వుండదు. ఈ విషయాన్ని ప్రధానంగా గుర్తుంచుకోవాల్సిందిగా రైతు మిత్రులను కోరుతున్నాను. వేప చెక్క, పశువుల ఎరువులు, కంపోస్టు ఎరువులు, వాన పాముల ఎరువుల్ని వాడడం మొదలు పెట్టడం మర్చిపోరాదు. ఆర్థిక కారణాలవల్ల, ఇవి దొరకని వారు బాధపడాల్సిన అవసరం లేదు. ఏ ఎరువులు లేకుండానే విత్తుకోవచ్చును.

## బహుళ పంటలు, అంతర పంటలు, ఆహార పంటలకు ప్రాధాన్యమివ్వండి

మెట్ట వ్యవసాయంలో ప్రధానంగా బహుళ పంటల విధానం పాటించాలి. ఒకే రకం పంట అనేక సంవత్సరాలు పెట్టుకుంటూ పోవడంకంటే, పంట మార్పిడి చేయడం, బహుళ రకాల పంటలు వేయడంవల్ల భూమి ఉత్పాదకత పెరుగుతుంది. చీడపీడలు బాగా తగ్గిపోయి, పంటలు ఆరోగ్యంగా ఉంటాయి. ఆదాయం కోసం వేసే పంటతో పాటు, కుటుంబ అవసరాల కోసం, పౌష్టిక ఆహారం అవసరాలను కూడా దృష్టిలో వుంచుకొని కూరగాయలు, నవధాన్యాలు ప్రతి రైతు పండించే పంటల విధానాన్ని రూపొందించుకోవాలి. దీనినే మనం సమగ్ర వ్యవసాయ విధానం లేదా సుస్థిర వ్యవసాయ విధానంగా పిలుచుకుంటున్నాం. వాటిని గూర్చి చర్చించుకుంటున్నాం. అంటే రైతుకు ఆదాయంతోపాటు, రైతు కుటుంబానికి అవసరమైన, కాయగూరలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యపు పంటల కోసం వ్యవసాయ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. స్వల్పకాలిక పంటలతో పాటు దీర్ఘకాలిక పంటలైన వృక్ష సంబంధ పంటలను కూడా ఇపుడే నిర్ణయించుకోవాలి. వీటి ప్రాధాన్యత గురించి గతంలో చాలా సార్లు చర్చించుకున్నాం. పౌష్టికాహార లోపం వల్ల మనిషి శరీరంలో బలహీనతలేర్పడి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. వైద్యం అంతా ప్రైవేటు మయం కావడంవల్ల, ఒక్కసారి తీవ్రమైన జబ్బు వస్తే, రైతు కుటుంబాలు కోలుకోలేనంతగా అప్పుల పాలవుతున్నాయి. దీనికంతటికీ కారణం, మనం గతంలో వాడిన చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు కూరగాయలు వాడకపోవడం. సులభంగా బియ్యం తినడానికి అలవాటు పడినాం. చిరు ధాన్యాలలో, పప్పుధాన్యాలలో పోషక పదార్థాలు ఏ విధంగా ఉన్నాయో, బియ్యంలో ఏ మాత్రం ఉన్నాయో గత మాసపు సంచికలో చర్చించుకున్నాం. అందుకే ఈసారి పంటలు పెట్టే ముందుగా ఒక ప్రణాళిక వేసుకోండి. భూమి విస్తీర్ణాన్ని బట్టి ఎంత భూమిలో వేరుశెనగ వెయ్యాలో, ఎంత విస్తీర్ణంలో చిరుధాన్యాలు వెయ్యాలో ఆలోచించండి. దానికి తోడు చేను పల్లపు ప్రాంతంలో గట్ల మీద, బీర, కాకర, సొర, గుమ్మడి లాంటి కాయగూర విత్తనాలు నాటండి. చేనులో అంతర పంటలుగా కందితో పాటు అలసంద, అనప, పెసర, నువ్వులు, మట్టిక్కాయ, గోంగూర విత్తనాలు కలపండి. రైతు కుటుంబానికి కావలసిన పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు కూరగాయలు లభిస్తాయి. కుటుంబానికి ఆహార భద్రత వుంటుంది. దేశానికి ఆహార భద్రత గురించి ఆలోచించే ముందు పండించే రైతు కుటుంబానికి ఆహార భద్రత గురించి మొదటగా ఆలోచించాలి గదా !

## పొలం గట్ల మీద చెట్ల మొక్కల్ని కాపాడుకోవాలి.

సంస్థ తరపున రైతుల పొలాల్లో గట్ల మీద చెట్ల విత్తనాలు నాటటం జరిగింది. మొక్కలకు నీరుపోసి పెంచుకోవడానికి ప్రయత్నాలు జరిగాయి. రైతులు బాగా ఆసక్తి ప్రదర్శించి మొక్కలకు రక్షణ ఏర్పాటు చేసుకున్న ప్రాంతాలలో మొక్కలు బతికిన శాతం సంతృప్తికరంగా వుంది. రైతులు అంతగా ఆసక్తి కనుపర్చని చోట్ల మొక్కలు బతికిన శాతం కొంచెం తక్కువగా వున్నాయి. ఈసారి కూడా గట్ల మీద, కుంట కట్టల మీద విత్తనం నాటి చెట్లు పెంచే కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుంది. అందులో దిబ్బ ఎరువులకు పనికి వచ్చే పచ్చి ఆకు మొక్కలు మేతకు పనికి వచ్చే మొక్కలు, సీతా ఫలంలాంటి పండ్ల మొక్కల విత్తనాలు పెట్టడం జరుగుతుంది. ఈ విత్తనాలను బాగా పదునున్న సమయములో జూన్, జూలై నెలలో, సరైన పద్ధతిలో నాటుట వలన బాగా మొలకెత్తి, బలంగా పెరిగే అవకాశముంది. కాబట్టి రైతులు తగిన శ్రద్ధ తీసుకొని సరైన సమయంలో, సరైన పద్ధతిలో నాటుట వలన బాగా మొలకెత్తి, బలంగా పెరిగే అవకాశముంది. కాబట్టి రైతులు తగిన శ్రద్ధ తీసుకొని సరైన సమయంలో సరైన పద్ధతిలో విత్తనం పెట్టుకోవలసిందిగా కోరుచున్నాను.

## చిన్న జీవాలను పెంచండి. అదనపు ఆదాయాన్ని పొందండి.

చేపల పెంపకం, పశువుల పెంపకం, కోళ్ళు, మేకలు గొర్రెల పెంపకంతో వ్యవసాయాన్ని అనుసంధానం చేసినపుడే సమగ్ర వ్యవసాయమవుతుంది. వట్టి కార్తె పంటలతో వ్యవసాయం అసంపూర్ణమై రైతులకు పూర్తి ఆదాయాన్నివ్వదు. ఏ విధంగా పంటలలో వైవిధ్యాన్ని పాటిస్తూ బహుళ పంటలు వేస్తాయో అదే విధంగా రైతుకు స్థిరమైన ఆదాయం కొరకు, ఎన్ని రకాలుగా వీలయితే అన్ని రకాలుగా, ఏ స్థాయిలో వీలైతే ఆ స్థాయిలో కోళ్ళు, గొర్రెలు, మేకలు, పాడిపశువుల పెంపకాన్ని చేపట్టినప్పుడు రైతు కుటుంబాలకు వాటి ద్వారా అదనపు ఆదాయం ఏర్పడుతుంది. స్థోమత లేకపోతే కనీసం రెండు గొర్రె పిల్లలనైనా పెంచుకోండి. వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని లెక్కలేయండి. మీకే అర్థమవుతుంది. వాటిని స్వంత పొలం గట్ల మీద జీవాలను తిప్పుకుంటూ వుంటే పొలానికి కాపాలాగా కూడా వున్నట్టుంటుంది.

## ప్రకృతిని గౌరవిద్దాం - వాతావరణ మార్పులను అధిగమిద్దాం.

మనమందరం గత 30-40 సంవత్సరాల నుండి విచక్షణా రహితంగా రసాయనిక ఎరువులను వాడడంవల్ల, భూముల్లో భాస్వరం, నత్రజని, నిల్వలు పెరిగిపోయి పోటాషియం మరియు అనేక సూక్ష్మ పోషక పదార్థాలు బాగా తగ్గిపోయినాయి. అందువలన భూమిలో అన్ని పోషకాలు సమపాళ్ళలో లేక భూమి అనారోగ్యంగా వుంది. కాబట్టి భూమికి తిరిగి స్వస్థత చేకూర్చాలి. దాని కోసం మనం పూర్తిగా సేంద్రీయ ఎరువులనే ఉపయోగించాలి. ఈ పని ఈ సంవత్సరం నుంచే ప్రారంభిద్దాం. తద్వారా భూమిలో నిలిచిపోయిన విషతుల్య అవశేషాలు కరిగిపోయి, సేంద్రీయ కర్బనం, సహజసిద్ధమైన సూక్ష్మ పదార్థాలు భూమిలో అభివృద్ధి చెందుతాయి. అలాగే పొలంగట్ల మీద నాటిన చెట్లు పెరిగి పెద్దవై గాలి వేగాన్ని నియంత్రిస్తాయి. పొలంలో వర్షాపాత ప్రవాహాన్ని నిలబెడుతాయి. పశువులకు మేతగా వుపయోగపడుతాయి. పచ్చదనం పెరుగుతుంది. వర్షాలను ఆకర్షిస్తాయి. ఇవన్నీ సమగ్ర వ్యవసాయ విధానంలో భాగాలు. ఇవన్నీ ఒకదానికొకటి విడదీయరానివి. అందుకే ఎన్నో ఒడిదుడుకుల మధ్య ప్రారంభించే మన వ్యవసాయం ప్రణాళికాబద్ధంగానూ, వాతావరణ మార్పుల కనుగుణంగా కొనసాగిద్దాం.

ఈ సంవత్సరం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ.

నమస్కారములతో

మీ

**డా॥ వై.వి. మల్లారెడ్డి**

**డైరెక్టరు : ఎకాలజి సెంటరు.**

# వేరుశనగలో ప్రధాన యాజమాన్య పద్ధతులు

**విత్తన ఉత్పత్తి :**

వేరుశనగ పంటను తదుపరి కాలాల్లో విత్తుకోవడానికి నాణ్యమైన విత్తనం అవసరం. నాణ్యమైన విత్తనాన్ని మళ్ళీ తిరిగి వాడుకునేందుకుగాను కొన్ని మెళకువలు పాటించాలి.

**మెళుకువలు :** నాణ్యమైన మంచిరకపు పంటను ఇతర లోకల్ రకాన్ని దూరంగా (5 మీ) విత్తుకోవాలి. పంటను విడిగా తీసి విడిగా నిలువ చేసుకోవాలి.

**విత్తన మోతాదు :**

గింజ పరిమాణం, మొలక శాతం...వీటిని బట్టి విత్తన మోతాదును నిర్ణయించాలి. మామూలు మొలకశాతమున్నచో టి.యం.వి-2 వంటి ఒక మాదిరి సైజుగల విత్తనం హెక్టారుకు 150 కేజీలు పడుతుంది. జి.యల్-24 వంటి లావుపాటి రకమైతే 175-180 కేజీల విత్తనం కావాలి.

కొత్తగా వేరుశనగ వేసే భూములకు, మాగాణిలో వరి తరువాత వేసే వేరుశనగ భూములకు 'రైజోబియం' అనే బ్యాక్టీరియాను విత్తనాలపై ఒక పొరలా ఏర్పడేటట్లు కలిపి భూమిలో వేయాలి. దీనివలన వేర్లపై బుడిపెలు త్వరగా ఏర్పడి పంటకు నత్రజని ఎరువు లభ్యమవుతుంది.

**విత్తనశుద్ధి**

వేరుశనగ పుప్పుజాతికి చెందినది. వేరుశెనగ మొక్క వేరు బుడిపెల ద్వారా నేరుగా వాతావరణ నుండి నత్రజనిని గ్రహిస్తుంది. ఈ ప్రక్రియ వేరుశనగ ప్రతి మొక్కలో వేరు బుడిపెల సంఖ్యను బట్టి ఆధారపడుతుంది. అధిక వేరు బుడిపెలుగల మొక్క అధిక పరిమాణంలో నత్రజనిని గ్రహిస్తుంది. ఇందుకు అధిక వేరుబుడిపెలు ఏర్పడుటకు గాను విత్తనాన్ని రైజోబియంతో కలిపి విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి. ఈ రైజోబియం ప్యాకెట్ల రూపంలో ఎరువుల దుకాణంలో లభిస్తాయి. లేదా ప్రాంతీయ వ్యవసాయ స్థానాల నుండి సమాచారం తెలుసుకోవచ్చు.

**విత్తేదూరం :**

రబీ పంటకాలములో వరుసకు వరుసకు మధ్య 22.5 సెం.మీ. మొక్కకూ మొక్కకూ మధ్య 10 సెం.మీ. దూరం ఉండేటట్లు విత్తితే చదరపు మీటరుకు 44 మొక్కలుండి తగినంత పైరు చేసి దిగుబడి పెరుగుతుంది. విత్తనాలు 4-5 సెం.మీ. లోతుకంటే ఎక్కువ లోతులో పడకుండా చూడాలి.

- పంట రకాన్ని బట్టి, కాలాన్ని బట్టి మొక్కల మధ్య విత్తే దూరం ఆధారపడి ఉంటుంది. కొన్ని రకాలు గుత్తిగా, కొన్ని రకాలు తీగ రకాలు ఉంటాయి. వీటికి అనుకూలంగా విత్తే దూరాన్ని మార్చుకోవాలి.
- గుత్తి రకాలు (వేమన, తిరుపతి 1-4, జెఎల్-24, టిఎంవి-2).
- వర్షాధారపు పంటగా 30×10 సెం.మీ., రబీలో 22.5 × 10 సెం.మీ.
- గుత్తి రకాలను తక్కువ దూరంలో విత్తుకోవాలి.
- తీగరకాలు (తిరుపతి-3, కదిరి-3) - ఖరీఫ్ వర్షాధారపు పంటగా 30×15 సెం.మీ., రబీలో నీటిపారుదల క్రింద 22.5 × 15 సెం.మీ.
- తీగ రకాలను ఎక్కువ దూరంలో విత్తుకోవాలి.

**విత్తటం :**

- విత్తే సమయంలో నేలలో తగినంత తేమశాతం ఉండాలి.
- విత్తనాన్ని గొర్రుతోగాని లేక నాగటి సాళ్ళలోగాని విత్తుకోవాలి.
- విత్తనాన్ని 5 సెం.మీ. లోతు మించకుండా విత్తుకోవాలి.

**అంతర కృషి :**

విత్తిన 20 రోజులకు ఒకసారి తదుపరి 15 రోజులకు రెండవసారి కలుపు తీసి మట్టిని తవ్వి మొక్కల మొదళ్ళకు ఎగదోయాలి. విత్తి 45 రోజుల తరువాత వూడలు క్రిందకి దిగడం ప్రారంభం అవుతాయి. కాబట్టి 45 రోజుల తరువాత ఎలాంటి అంతర కృషి చేయకూడదు.

**నీటి యాజమాన్యం :**

- వేరుశనగ పంటకు సుమారుగా 400-450 మీ.మీ. నీరు అవసరం అవుతుంది. తేలికపాటి నేలల్లో 8-9 తడులు, సారవంతమైన నేలల్లో 5-6 తడులు సరిపోతాయి.
- మొదటితడి విత్తుటకు ముందు నీరుపెట్టి నీటి శాతం తగు మోతాదులో ఉన్నప్పుడు విత్తుకోవాలి.
- రెండవ తడి విత్తిన 20-25 రోజులకు (మొదటి పూత దశ) ఇవ్వాలి. తరువాతి తడులు నేల లక్షణాన్ని బట్టి 7-10 రోజుల వ్యవధిలో నీరు కట్టాలి.
- ఆఖరి తడి మాత్రం పంట కోతకు 15 రోజులు ముందు ఉండేటట్లు చూసుకోవాలి.

**వేరుశనగ పంటలో నీరు తప్పనిసరిగా అవసరమగు దశలు :**

1. పూత దశ. 2. ఊడలు దిగటం, 3. కాయ తయారై గింజ కట్టడం. అంటే ఈ దశల్లో పంటకు తప్పనిసరిగా నీరు ఉండేవిధంగా చూసుకోవాలి. నీటి కొరత లేకుండా జాగ్రత్త వహించాలి.

**పంట మార్పిడి :**

వరి తరువాత వేరుశనగ వేయడం ద్వారా నులిపురుగు సమస్యను తగ్గించవచ్చు. ఈశాన్య ఋతుపవనాల ప్రభావం ఉన్న ప్రాంతాలకు (నెల్లూరు, అనంతపూర్ ప్రాంతాలు) వేరుశనగ తరువాత పెసర్లు / ఉలవలు వేసుకోవాలి.

**అంతర పంటలు :**

వేరుశనగలో ఇతర పంటలను అంతర పంటలుగా వేసుకోవడం ద్వారా సహజమైన రైతుకు మిత్ర కీటకాలు సంఖ్య పెరిగి పురుగులు మరియు తెగుళ్ళ బాధ తగ్గుతుంది. సహజంగా ఆదాయం కూడా పెరుగుతుంది. కంది/ఆముదం మరియు సజ్జ, వేరుశెనగ పంటతో విత్తుకోవటం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చు.

**వేరుశనగలో విత్తనాల శుద్ధి :**

విత్తే ముందు కాయలను చేతితో ఒలిచి, ఒక పాత్రలో నీటిని వేడిచేసి నూరు వరహాల(లాంటెనా) ఆకులను వేసి మూతపెట్టి రాత్రంతా ఉంచాలి. మరుసటి రోజు కషాయాన్ని వడపోసి, 100 గ్రాముల బెల్లం కలపాలి. వేరుశెనగ విత్తనాలకు ఈ కషాయాన్ని బాగా పట్టించి, నీడలో ఆరబెట్టాలి.

Page No. 4 - Green  Page No. 4 - Red  Page No. 4 Black



# సంవత్సరకాలంగా ఫాదర్ దివ్య స్మృతిలో...

> *"పేదరికంతోనూ అన్యాయంతోనూ పోరాడి, పీడితులకు విముక్తి కల్గించుటకు మనము మనుషులుగా జన్మించినాము. ఇది మన జీవిత కర్తవ్యం. ఇదే మన జీవిత పరమార్థం. మనమెవరు, ఎందుకు జన్మించాము అనే ప్రశ్నలకు సమాధానం"*
>
> **– ఫాదర్ ఫెర్రర్**

ఫాదర్ ఫెర్రర్ మన మధ్య నుంచి వెళ్ళిపోయి, 19-06-2010 శనివారం నాటికి సంవత్సర కాలం అవుతుంది. ఫాదర్‌కు మనుషుల పట్ల ఉన్న అవాజ్యమైన ప్రేమానురాగాలు, అవసరంలో ఉన్న వారిని ఆదుకునే పట్టుదలలు జిల్లా ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నాయి. ఒక మనిషి బతికి వున్న కాలంలో కంటే చనిపోయినప్పుడే ఆ మనిషి ఔన్నత్యాలు బయటపడతాయన్న నానుడి ఫాదర్ విషయంలో రుజువయ్యింది. అనంతపురం జిల్లా ప్రజలందరు వారూ, వీరు అనే బేధం లేకుండా ఫాదర్ పట్ల గౌరవం ప్రకటించారు. మరణవార్త విన్నప్పుడు లక్షలాది జనం శోక సముద్రంలో మునిగిపోయారు.

ప్రజల హృదయాలలో ఇంతగా ఎదిగిన ఫాదర్ మరణంతో, ఏ సేవా కార్యక్రమాల్ని ఫాదర్ ప్రారంభించారో, వాటి కోసం నిరంతరం తపించారో, అదే పద్ధతిలో కొనసాగుతాయా అని సందేహాలు వెలిబుచ్చిన వారుకొందరున్నారు. ఇటువంటి సందేహాలు చాలా సహజం. ఎంతటి గొప్ప వ్యక్తి అయినా మరణించిన తర్వాత ఏదో ఒక మేరకు శూన్యం ఆవరించడమో, మందగమనం ఏర్పడ్డడమో జరుగుతుంది. కానీ ఫాదర్ తాను ఇష్టపడి పని చేయడంతోపాటు, సంస్థలోని సిబ్బంది అందరూ ప్రజలకు సేవ చెయ్యడంలో ఇష్టపడి పని చేసేవిధంగా వారిలో ధార్మిక భావనలను అభివృద్ధి చేశారు. శ్రీమతి అన్నే ఫెర్రర్, వారి కుమారుడు మాంచో ఫెర్రర్‌తో పాటు, అనేక మంది సమర్థవంతులైన నాయకులను సంస్థకు అందించారు. దాని ఫలితమే ఈనాడు ఫాదర్ భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఫాదర్ విశ్వాసాల వెలుగులో సంస్థ బాధ్యులు ప్రతి ఒక్కరూ పని చేస్తున్న కారణంగా ప్రజలకు సేవలందించడంలో ఇబ్బందులు రాలేదు. "ప్రతి మంచి కార్యక్రమంలోనూ, అనేక మతాల, తత్వశాస్త్రాల సిద్ధాంతాలున్నపుడు నేనెందుకు ప్రత్యేకంగా సత్యశోధన చెయ్యాలి" అన్నటువంటి ఫాదర్ మాట సంస్థలో మాకందరికీ చీకటిలో దారి చూపే ప్రచండ వెలుగు దివ్వెలా ప్రకాశిస్తూనే వుంటుంది. "పేదలకు ఆలంబనగా వుండాలి. విధుల సమయానికి మించి పని చేయాలి. చేసిన పనిలో నాణ్యతా ప్రమాణాలు సాధించాలి. సాధ్యమయినంత మంది ప్రజలకు చేరువ కావాలి". వీటిని ఆర్.డి.టి. మూల ధర్మాలుగా ఫాదర్ ప్రకటించారు. తన తర్వాత శూన్యం ఆవరించకుండా ఫాదర్ సంస్థను తీర్చిదిద్దారు. మంచికి, మానవత్వానికి, సేవా నిరతికి ఎల్లలు, భౌతిక సరిహద్దులు ఉండవని ఫాదర్ విషయంలో రుజువయింది. ఖండంతారాలను దాటి భాషకాని భాషతో, దేశం కాని దేశంలో మారుమూల ప్రాంతంలోని కరువు జిల్లాలో సిస్టర్ అన్నే సాహచర్యంతో నాటిన మొక్క ఆర్.డి.టి. ఈ సంస్థను ఆపన్నులకు, అభాగ్యులకు ఆలంబనగా నీడనిచ్చే వటవృక్షంగా తన జీవిత కాలంలోనే తీర్చిదిద్దారు. నిత్య నూతన గమనపు నడకను నేర్పి వెళ్ళారు. జాతి, మత, ప్రాంతాలకతీతంగా ప్రజలకు మంచి చేసిన కాటన్, మన్రోలను ప్రజలు స్మరించుకుంటున్నట్లే, దాదాపుగా 40 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో విద్య, వైద్యం, వ్యవసాయం, నివాసం రంగాలలో అనంతపురం జిల్లా ప్రజల జీవితాలతో, జిల్లా అభివృద్ధిలో ఒక భాగంగా ఆర్.డి.టి. పెనవేసుకపోయింది.

ఫాదర్ ! మీరు భౌతికంగా మా మధ్య లేకపోవడం మాకు బాధాకరమే. పుట్టిన ప్రతి జీవికి మరణం తప్పదని కూడా మాకు తెలుసు. పేద ప్రజల గురించి, మన బాధ్యతల గురించి వారికి ఏ రకంగా సేవ చేయాలనే అవకాశాలను వెదికి పుచ్చుకోవాలనే తత్వాన్ని మీ సహచర్యంలో అర్థం చేసుకున్నాం. చేసే ప్రతి పనిలోనూ మీరు మాకు వెన్ను తట్టి ప్రోత్సహిస్తున్నట్లుగానే ఫీలవుతున్నాం. మీ అపూర్వ సహచర్యంలో మమ్మల్ని మేము మానవులుగా తీర్చిదిద్దుకోగలిగాం. మీ చల్లని చూపుల వెలుగులు నిరంతరం మాకు దారిచూపుతూనే వుండాలి.

**డా॥ వై.వి. మల్లారెడ్డి**

**డైరెక్టరు : ఎకాలజి సెంటరు.**

**ప్రచురణ: డైరెక్టరు - ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం - 515 002.**

**☎ (08554) - 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) - 244990, E-mail : actionf@sancharnet.in**
**actionf_atp@dataone.in**